# ఉత్తరం

**-పి.లక్ష్మీశేఖర్**

"సునీతా...ఈరోజు నువ్వు ఆఫీసు నుంచి సాయంత్రం తొందరగా రామ్మా.. పెళ్లిచూపులున్నాయి" అన్నాడు రాజారావు.

తండ్రి మాటలు విన్న సునీత ఒక్కసారి నిట్టూర్చింది. మొదలయ్యింది పెళ్లిసీను. ఆషాఢమాసం రెండునెలలు ఎక్కువుంటే బాగుండు మనసులో అనుకుంది.

"అలాగే నాన్నా" నిర్లిప్తంగా ఉంది సమాధానం.

సాయంత్రం నాలుగింటికల్లా ఇంటికి వచ్చేసింది సునీత. గబగబా తన రూమ్‌లోకి వెళ్లి తలుపేసుకుంది.

"సునీతా! కొంచెం టీ తాగి ముఖం కడుక్కుని ఒక్క పదినిముషాలు నడుం వాల్చమ్మా. ముఖం మరీ వాడిపోయింది. వాళ్ళు ఐదున్నరకి వస్తామని ఫోన్ చేసారు" అంది తల్లి.

"ఇప్పుడు కాదు తరువాత. నన్ను ఎవరూ డిస్టర్బ్ చేయకండి. నేను టైముకి వస్తాను" లోపలి నుంచి సమాధానం.

"ఏమండీ...ఏమిటి అమ్మాయి అలా వెళ్లిపోయింది. ప్రేమ, దోమలాంటి వ్యవహారాలు ఏమన్నా ఉన్నాయంటారా?"

"ఛ..ఛ..అలాంటిదేమీ ఉండదు. నీ అనుమానం అంతే. అమ్మాయి చాలా మెచ్యూర్డ్ గర్ల్. తనకేమి కావాలో నిర్భయంగా చెబుతుంది. నువ్వు వెళ్లి పనులు చూడు. నేను వెళ్లి స్వీట్లు అవీ తెస్తాను" అంటూ బయటకు వెళ్లాడు రాజారావు.

★★★

పెళ్లిచూపుల తతంగం పూర్తయింది. అబ్బాయి తరపు వాళ్లకి అమ్మాయి నచ్చింది. అబ్బాయి దొంగచూపులు చూస్తున్నాడు.

"బాబూ! నువ్వు అమ్మాయితో ఏమైనా మాట్లాడాలి అనుకుంటే మాట్లాడవచ్చు" అన్నాడు రాజారావు.

"థాంక్సండీ... వేరే రూమ్..." అంటూ నసిగాడు.

పక్కరూమ్‌లో అమ్మాయి కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు. సునీతని చూడగానే "మీరు నాకు బాగా నచ్చారు. నేను ఇంజనీర్ అన్న విషయం మీకు తెలుసుకదా. నాకు జీతం ఐదంకెల్లో వుంటుంది. అఫ్‌కోర్స్ నేను మీకు నచ్చుతానులెండి. అయినా మీ అభిప్రాయం మీ నోటితో చెబితే బావుంటుంది"

"నేను మీకు నచ్చానని మీరు అప్పుడే అనుకోవద్దు. అఫ్‌కోర్స్... నేను కూడా ఇంజనీర్‌నే. మీరు ఈ ఉత్తరం చదివి అప్పుడు మీ అభిప్రాయం చెప్పండి" అంది సునీత.

ఉత్తరం చదివిన వెంటనే ముఖంలో రంగులు మారడం స్పష్టంగా కనిపించింది సునీతకి.

అబ్బాయి కోపంగా బయటకువచ్చి రాజారావు చేతికి ఉత్తరం ఇచ్చి "నాకు అమ్మాయి నచ్చలేదు. ఇలాంటి ఉత్తరం చూపిస్తే మీ అమ్మాయికి ఇక ఈ జన్మలో పెళ్లికాదు" అంటూ విసవిసా వెళ్లిపోయాడు.అతనితో వచ్చినవాళ్లందరూ సగం సగం స్వీట్లు చేతిలో పట్టుకుని తినాలా వద్దా అనుకుంటూ అక్కడ పెట్టి బయటకు నడిచాడు.

"ఏమయ్యిందండీ ఆ ఉత్తరంలో..ఆ ఉత్తరంలో ఏముంది? ఎందుకు అబ్బాయి అలా వెళ్లిపోయాడు?"కంగారుగా అడిగింది రాజారావుని.

ఉత్తరం చదివిన రాజారావు కూతురు దగ్గరకు వెళ్లాడు.

"అందుకే అంటారు ఆడపిల్లని ఎక్కువ చదివించకూడదని. చూసారా దీని నిర్వాకం. ఎవరైనా వింటే నవ్విపోతారు. పెళ్లిచూపులకు వచ్చిన అబ్బాయికి ఎవరైనా ఇలా ఉత్తరాలు ఇస్తారా" దీర్ఘాలు మొదలుపెట్టింది సునీత తల్లి.

"నువ్వు నోరుముయ్యి ఇంక. నీ గొంతుతో పక్కవాళ్లందరికీ ప్రచారం చేసేటట్లు ఉన్నావు. అమ్మాయికి అన్నీ తెలుసు. దానిని ఏమీ అనకు" వెళ్లిపోయాడు రాజారావు సునీత చేతిలో ఉత్తరం ఉంచుతూ.

తండ్రివైపు కృతజ్ఞతగా చూసింది సునీత.

★★★

"సునీతా! నీ పెళ్లిచూపులు ఏమయ్యాయి" ఆత్రంగా అడిగింది రోజా.

"ఈ ఉత్తరం చూసిన పెళ్లికొడుకు పిల్ల నచ్చలేదని వెళ్లిపోయాడు" తన బెస్ట్ ఫ్రెండ్ రోజాతో చెప్పింది సునీత.

"ఏదీ ఉత్తరం" అంటూ లాక్కుంది రోజా.

"ఈ ఉత్తరం చదివిన ఎవరైన పెళ్లికి ఒప్పుకుంటారా? నువ్వు ఇలా వచ్చినవాళ్లందరికీ ఉత్తరం చూపిస్తే ఈ జన్మలో నీకు పెళ్లవదు" రోజా.

"పోనీలే అయినప్పుడే అవుతుంది నో కాంప్రమైజ్" అంది సునీత.

★★★

నెలరోజుల తరువాత "ఇదిగో సునీతా...నీకు ఈరోజు పెళ్లిచూపులు. ఉత్తరాలూ అవీ చూపిస్తే ఈసారి నేనూరుకోను. కాస్త జాగ్రత్తగా మసలుకో" ఇంచుమించుగా శాసించింది తల్లి.

మళ్లీ యధాప్రకారం పెళ్లికొడుకు విడిగా మాట్లాడడం, సునీత ఉత్తరం ఇవ్వడం జరిగిపోయాయి.

ఈసారి పెళ్లికొడుకు "కొంచెం ఆలోచించుకుని జవాబు చెబుతాను" అని అనడంతో సునీత తల్లి కోపంగా ఆమెవైపు చూసింది.

వాళ్ళు వెళ్లాక మళ్లీ తల్లి ఆగ్రహానికి బలి కావాల్సి వచ్చింది సునీత. వారంరోజులపాటు సునీతకి, తల్లికి మధ్య కోల్డ్‌వార్ నడిచింది.

మూలిగే నక్కమీద తాటికాయ పడిన చందాన మరోసారి పెళ్లిచూపులు ముంచుకొచ్చాయి సునీతకు.

"ఈసారి ఉత్తరం చూపిస్తే నామీద ఒట్టు. ఈ సంబంధం కుదరకపోతే నేను ఛస్తాను" బెదిరించింది తల్లి.

"అమ్మా...పెళ్లంటే జీవితాంతం కలసి బ్రతకాలి. నా అభిప్రాయం నేను చచ్చినా మార్చుకోను. నువ్వు ఇలా బెదిరిస్తే నేను అస్సలు పెళ్లే చేసుకోను" అంది సునీత.

"ఎందుకే దాన్ని అలా బాధపెడతావు. దానికి అన్నీ తెలుసు. నేను కూడా ఉత్తరం చదివాను. నాకులేని బాధ నీకెందుకు?" అన్నాడు రాజారావు.

"ఆ...ఆ...ఇలా దాన్ని వెనకేసుకువచ్చారు కాబట్టే అది మునగచెట్టు ఎక్కి కూర్చుంది. ఒక్కతే

కూతురని ముద్దుచేసి దాన్ని చెడగొట్టారు. నేను అస్సలు పట్టించుకోను. మీరే ఏదో ఒకటి చేసు కోండి'' విసవిసా వెళ్లిపోయింది.

***

మళ్లీ యధాప్రకారం పెళ్లికొడుకు ఉత్తరం చూడడం జరిగింది. ఈసారి పెళ్లికొడుకు ఓకే అన డంతో ఇంట్లో అందరూ సంతోషపడిపోయారు.

"ఏంటీ పెళ్లికొడుక్కి నచ్చావా? ఉత్తరం చూసి పెళ్లి చేసుకుంటానన్నాడా? ఒక్కసారి అతడ్ని చూడాలని ఉంది'' ఆత్రుతగా అంది రోజా.

"చాల్లే ఊరుకో. నీకు అంతా వేళాకో ళమే. తొందర్లో చూస్తావుగా. తొందరెం దుకు?'' వారించింది సునీత.

వీళ్ల సంభాషణ అంతా గమనిస్తున్నాడు నవీన్.


సునీత వాళ్ల కొలీగ్ నవీన్. ఈమధ్య డెప్యుటేషన్‌మీద వేరే ఊరు వెళ్లడం పనిలో కాస్త బిజీగా ఉన్నాడు. సునీత, నవీన్, రోజా మంచి ఫ్రెండ్స్ కూడా.

"ఏమిటి రోజా! సునీతగారు రెండురోజుల నుంచి ఆఫీసుకు రావడంలేదు'' అడిగాడు నవీన్.

"మీకు తెలియదుకదా నవీన్. సునీతికి పెళ్లి కుదిరింది. ఆ పనుల్లో ఉండి రాలే దేమో''

"అవునా...'' కొంచెం బాధగా అనిపిం చింది నవీన్‌కి.

సునీత అంటే నవీన్‌కి చాలా ఇష్టం. ఈతరం అమ్మాయి. ఆమెకి ఏం కావాలో బాగా తెలుసు. కానీ ఆమెకి ఎప్పుడూ చెప్పే ధైర్యం చేయలేదు.



తరువాత ఆఫీసుకు వచ్చిన సునీతను చూసి "కంగ్రాట్స్ సునీత. ఏంటి నాకు చెప్పకుండా పెళ్లి చేసుకుందామని అనుకున్నారా?'' అన్నాడు నవీన్.

"రోజా చెప్పిందా?'' అంది సునీత.

"అవునండి''

"అది క్యాన్సిల్ అయింది. ఉత్తరం గురించి తెలిసి అతని ఇంట్లో వాళ్ళు ఒప్పుకోలేదు'' కూల్‌గా చెప్పింది సునీత. మనసులో ఆనందపడ్డాడు నవీన్.

'నేను ధైర్యం చేసి ఎలాగైనా చెప్పాలి సునీతకి' మనసులో అనుకున్నాడు.

"సారీ...'' చెప్పి వెళ్లిపోయాడు.

నార్మల్‌గా ఉన్న సునీతని చూసి రోజా "ఏంటే నీకింత కాన్ఫిడెన్స్. ఆ ఉత్తరంచూసి ఎవ్వరైనా పెళ్లి చేసుకుంటారా?''

***

ఆ రోజు సాయంత్రం బస్టాప్‌లో ఉన్న సునీత దగ్గరకు ధైర్యంచేసి వెళ్లాడు నవీన్.

"సునీతా! మీతో కొంచెం మాట్లాడాలి. మీరేమీ అనుకోకపోతే అలా పార్కులో కూర్చుందాం రండి''

"నో ప్రాబ్లమ్ పదండి'' అంది సునీత.

"నాకు సూటిగా మాట్లాడడం అలవాటని మీకు తెలుసుకదా. కానీ ఎలా అడగాలో అర్థం కావడంలేదు''

"ఫర్వాలేదు చెప్పండి''

"నేను మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను'' సునీత కళ్లల్లోకి సూటిగా చూస్తూ అడుగుతున్న నవీన్‌ను చూసి ఆశ్చర్యపోయింది సునీత.

"నవీన్! నాకీమధ్య చాలా పెళ్లిచూపులు జరిగాయి. నిన్ననే ఓకే అన్న అబ్బాయికి వాళ్లింట్లో నేనిచ్చిన ఉత్తరం చూసి నో చెప్పారు. మీకు ఈ రోజు ఉదయం చెప్పింది దాని గురించే. నేను మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలని అనుకుంటే ఈ ఉత్తరం చదవండి. మీకు నచ్చితే సరే లేకపోతే ఎప్పటిలాగే ఫ్రెండ్స్‌గా ఉండిపోదాం'' ఉత్తరం చదివిన నవీన్ ఒకసారి సునీతవైపు చూసి ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోయాడు. మర్నాడు సునీతకి ఆఫీసులో నవీన్ కనిపించకపోయేసరికి మొదటిసారి ఆమె మనసులో ఏదో తెలియని గిల్టీ ఫీలింగ్ అనిపించింది. ఉత్తరం విషయంలో ఏమైనా తప్పు చేస్తున్నానా అని మధనపడింది ఒక్క క్షణం. మరునిముషంలో మామూలుగా అయిపోయింది.

***

తన కళ్లని తానే నమ్మలేకపోతోంది. అలాగే నుంచుని ఉండిపోయింది. తల్లి మొహం ఆనందంతో వెలిగిపోతోంది. తండ్రి కూడా ఎంతో సంతోషంగా కనిపిస్తున్నాడు. నవీన్ వాళ్ల పేరెంట్స్ తనకోసం ఇంట్లో ఎదురుచూస్తూ ఉండడం చాలా ఆశ్చర్యంగా అనిపించింది నవీన్‌కు.

"సారీ సునీతా! నిన్ను ఆశ్చర్యపరుద్దామని మా పేరెంట్స్‌ని కూడా తీసుకువచ్చేసాను. మరి పెళ్లి డేటు ఎప్పుడు ఫిక్స్ చేయమంటావు?'' కొంటెగా అడిగాడు నవీన్.

"సునీతా! నాకు ఎలాంటి భార్య కావాలని అనుకున్నానో అలాంటి లక్షణాలు అన్నీ ఉన్న నిన్ను అంత తేలిగ్గా వదులుకోలేను. అయినా ఉత్తరం చూసి నిన్ను పెళ్లి చేసుకోనని ఎలా అనుకున్నావు?'' అన్నాడు నవీన్.

పక్క గదిలో ఉన్న తల్లికి ఉత్తరం మాట వినిపించింది.

తాంబూలాలు కూడా అప్పుడే అనడంతో వచ్చిన పెళ్లివారి హడావుడిలో ఉన్న సునీత తల్లికి ఉత్తరం గురించి తెలుసుకోవాలన్న ఆత్రుత మాత్రం తగ్గలేదు.

***


అందరూ వెళ్లిపోయాక సునీత గదిలో టేబుల్ మీదున్న ఉత్తరం చూసింది తల్లి.

"భార్యాభర్తలంటే జీవితాంతం మంచి స్నేహితులుగా ఉండాలి. అన్ని బాధ్యతలు సమానంగా పంచుకోవాలి. ఒకరిమీద ఒకరికి నమ్మకం ఎప్పుడూ ఉండాలి. అన్ని విషయాలలో ఇద్దరూ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. నాకు ఏడడుగులు, మూడుముళ్ళు కాదు ముఖ్యం. ఆప్యాయత, అనురాగాలు కలకాలం ఉంచే మనసు ముఖ్యం. మరో ముఖ్య విషయం. మా తల్లిదండ్రులకి నేను ఒక్కతే కూతురిని. అందుకే వాళ్ల పూర్తి బాధ్యత మనస్ఫూర్తిగా మీరు కూడా స్వీకరించాలి. ఇవన్నీ ఆచరణలో పెట్టగలను అన్న నమ్మకం మీకు ఉంటే మిమ్మల్ని నిరభ్యంతరంగా పెళ్లి చేసుకోగలను. ఇప్పుడే సరే అని తరువాత ఆచరించలేకపోతే నేను ఎలాంటి నిర్ణయం తీసుకోవడానికైనా వెనుకాడను''

ఉత్తరం చదివిన తల్లి మనసు ఆనందంతో నిండిపోయింది. జీవితం గురించి ఇంత అవగాహన ఉన్న కూతురిని తలచుకుని సంతోషపడింది. ఉత్తరాన్ని అలా చూస్తూ ఉండిపోయింది.

★

## అందాల ఆరబోత



లారెన్స్ కొత్త చిత్రం 'స్టయిల్' గురించే అంతా చర్చించుకుంటున్నారు. పొలిటికల్ రౌడీలో హీరోయిన్‌గా చేసి అందాలారబోసిన ఛార్మి, మీనాక్షి హీరోయిన్ కమలినీముఖర్జీ నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయియింది. 'ఎవడి గోల వాడి దే' చిత్రాన్ని నిర్మించిన లగడపాటి శ్రీధర్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. మణిశర్మ సంగీతాన్ని సమకూర్చిన ఈ చిత్రంలో అన్ని వర్గాలకి నచ్చే అంశాలున్నాయంటున్నారు. చూద్దాం ఈ చిత్రం ఏమేరకు సక్సెస్‌ని అవుతుందో? ఆ చిత్రం తర్వాత ఆమె కెరీర్ ఎలా ఉంటుందో చూద్దాం.

